జాతీయస్థాయికి ఎంపికైన డబుల్ ఇక్కత్ చీరను చూపుతున్న ముఖేశ్

నేత కార్మికుడికి జాతీయ పురస్కారం

చౌటుప్పల్ రూరల్, జూలై 24: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంకు చెందిన చేనేత కార్మికుడు కర్నాటి ముఖేశ్ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రత్యేక డిజైన్‌తో ప్రకృతి రంగులతో పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర తయారు చేసినందుకు జాతీయ స్థాయి సెయింట్ కబీర్ హ్యాండ్లూమ్ పురస్కారానికి ఎంపికయ్యారు. డబుల్ ఇక్కత్ విభాగంలో కేంద్ర చేనేత జౌళిశాఖ జాతీయ స్థాయిలో అందించే 2023 పురస్కారానికి దేశ వ్యాప్తంగా 14 మందిని ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ముఖేశ్‌కు గుర్తింపు దక్కింది. అవార్డు కోసం రాష్ట్రం నుంచి 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్ణాటి ముఖేశ్ ప్రకృతి రంగులను ఉపయోగించి వంద రకాల పూల డిజైన్లతో తయారు చేసిన డబుల్ ఇక్కత్ చీర ప్రత్యేకత కనబర్చడంతో నిపుణుల కమిటీ పురస్కారానికి ఎంపిక చేసింది. కర్నాటి ముఖేశ్ బీటెక్ చదివారు. తాత, తండ్రి వారసత్వంగా వచ్చిన చేనేత వృత్తిపై మక్కువతో 15 ఏండ్లుగా అందులోనే కొనసాగుతూ.. ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొండాలక్ష్మణ్ చేనేత అవార్డు అందుకున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన ముఖేశ్‌ను చేనేత సంఘం నాయకులు, స్థానికులు అభినందించారు.

ఏజెన్సీ రైతులకు కొర్రీలు పెట్టొద్దు

చండ్రుగొండ, జూలై 24: రైతులందరికీ బేషరతుగా పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత రైతులకు ఎలాంటి కొర్రీలు పెట్టొద్దని సూచించారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో, బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్‌బుక్‌తోనేగాక పహాణీలతో తీసుకున్న పంట రుణాలను కూడా మాఫీ చేయాలని కోరారు. పట్టా బుక్కులు, రేషన్‌కార్డులు లేవనే సాకుతో రైతులకు అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులు పహాణీలతోనే పంట రుణాలు తీసుకున్నందున వారందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుభరోసాను కూడా వెంటనే అందించాలని సూచించారు. అనంతరం ఆర్ఐ అక్బర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేటి నుంచి 'దోస్త్' స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): డిగ్రీ కాలేజీలలో సీట్ల భర్తీకి దోస్త్-2024 స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నేటి(గురువారం) నుంచి ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో దోస్త్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉంటుందని, రూ.400 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. 27 నుంచి ఆగస్టు 3 వరకు స్పెషల్ ఫేజ్ వెబ్ ఆప్షన్ల నమోదు, 6న సీట్ల కేటాయింపు, 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు విధించారు. ఆన్‌లైన్ ద్వారా రిపోర్టింగ్ చేసిన వారు 7 నుంచి 9 వరకు నేరుగా కాలేజీలలో రిపోర్టు చేయాలని అధికారులు తెలిపారు. వివరాలకు దోస్త్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

దోస్త్ ద్వారా నిథమ్‌లో బీబీఏ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో బీబీఏ కోర్సు అడ్మిషన్లను ఈ ఏడాది నుంచి దోస్త్ ద్వారా చేపట్టనున్నారు. సంస్థ అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల ఆదేశాలను జారీ చేయగా, నిథమ్ చైర్‌పర్సన్ వాణిప్రసాద్ బుధవారం సమీక్ష నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు.

నూరేండ్లు వర్ధిల్లు

- పుట్టినరోజున కేటీఆర్‌కు కేసీఆర్ దంపతుల దీవెనలు
- వివిధ ప్రాంతాల్లో బర్త్‌డే వేడుకలు
- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రక్తదానం
- ఓయూలో మొక్కలు నాటిన విద్యార్థి నాయకులు

లండన్‌లో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను 'నూరేండ్లు వర్ధిల్లు' అంటూ పార్టీ అధినేత కేసీఆర్ ఆశీర్వదించారు. తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం కేటీఆర్ తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్, శోభమ్మ దంపతులను సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కూతురు అలేఖ్యతో కలిసి దీవెనలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పలుచోట్ల వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

అసెంబ్లీలో కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శాసనసభలో సభ్యుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తొలుత కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కేటీఆర్ సీటు వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు అందజేశారు. టీ బ్రేక్ సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్, విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మదన్‌మోహన్, బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు సైతం కేటీఆర్ వద్దకు వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. శాసనమండలి సమావేశాలు ముగియగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలందరూ అసెంబ్లీకి వచ్చి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి బీఆర్ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి, కే సంజయ్, కోవా లక్ష్మి, ఎమ్మెల్సీలు బండ ప్రకాశ్, శేరి శుభాశ్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, శంబీపూర్ రాజు, తాతా మధు, సత్యవతి రాథోడ్, ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో రక్తదానం

కేటీఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్వీ నాయకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. అంతకు ముందు మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, లింగయ్యయాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, రామ్మూర్తియాదవ్, రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్, రూప్‌సింగ్, అంజనేయగౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఓయూలో గాదరి కిశోర్ ఆధ్వర్యంలో వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ శాఖ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటి, కేక్ కట్ చేసి కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, వల్లమల్ల కృష్ణ, వీరబాబు, మంద సురేశ్, కడారి స్వామి, పడాల సతీశ్, జంగం అవినాశ్, గదరాజు చందు, జహీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం లండన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ దూసరి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో యూకే కమిటీ ప్రధాన కార్యదర్శి, టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, నాయకులు నవీన్‌రెడ్డి, ప్రవీణ్ వీర, హరిగౌడ్ నవాబీపేట్, శ్రీకాంత్ జెల్ల, సత్య చిలుముల, జాయింట్ సెక్రటరీ మల్లారెడ్డి బీరం, సతీశ్‌రెడ్డి గొట్టెముక్కుల, రవిప్రదీప్ పులుసు, రవి రేతినేని తదితరులు పాల్గొన్నారు.

సాంచాల వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న మల్లయ్య

మరో నేతన్న ఆత్మహత్య

- ఏడు నెలలుగా ఉపాధి లేక..
- బతుకు భారమై బలవన్మరణం
- జగిత్యాల జిల్లాలో విషాదం

పెగడపల్లి, జూలై 24: స్వరాష్ట్రంలో పునర్జీవం పోసుకున్న చేనేత రంగం ప్రస్తుతం మళ్లీ సంక్షోభంలోకి వెళ్లింది. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం చూపుతున్న వివక్షతో మళ్లీ మరణమృదంగం మోగుతున్నది. కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల ప్రాంతంలో ఇప్పటికే ఎనిమిది మంది చనిపోగా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పన్నెండు మంది నేతన్నలు ఆకలిచావులు, ఆత్మహత్యలు చేసుకోవడం కలకలం రేపుతున్నది. తాజాగా జగిత్యాల జిల్లాలో మరో నేతన్న తనువుచాలించాడు. వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లి గ్రామానికి చెందిన గుండేటి మల్లయ్య (55)కు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉండగా, వారికి వివాహాలు జరిగి ఇతర ప్రాంతాల్లో బతుకుతున్నారు. మల్లయ్య తన భార్య రాజేశ్వరితో కలిసి ఇక్కడే చీరలు నేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన ఆర్డర్లతో చేతినిండా పనితో దర్జాగా బతికాడు. ఏడు నెలలుగా ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికితోడు కూతురి వివాహం కోసం చేసిన అప్పులు అలాగే ఉండటంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. బుధవారం భార్య రాజేశ్వరి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లగా, మల్లయ్య తన సాంచాల కార్ఖానాలోనే ఉరేసుకున్నాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఏఎస్సై సత్తయ్య, ఎస్‌హెచ్‌వో రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేతన్నకు నా వంతుగా..

మొదటిపేజీ తరువాయి...

ఉన్న సిరిసిల్ల నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తుండటంతో, వారి ఇబ్బందులను తీర్చాలని నిర్ణయించుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఐదేండ్ల క్రితం తన పుట్టినరోజున ప్రారంభించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. చేనేత కుటుంబాలు, వారి పిల్లల విద్య, భవిష్యత్తు అవసరాల కోసం ఆర్థికసాయం చేయనున్నట్టు ప్రకటించారు. 2020లో కరోనా సమయం నుంచి తన పుట్టినరోజున ఇతరులకు సాయంచేసే విధంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నానని, తనతోపాటు తన శ్రేయోభిలాషులు, అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్నారని తెలిపారు. ఈ ఐదేండ్లలో అంబులెన్స్‌లతో పాటు 6,000 మంది విద్యార్థులకు టాబ్స్, 1,400 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, స్కూటర్లను అందజేశానని వివరించారు. పెద్దలు చెప్పిన్నట్టు పుట్టుక, మరణం మాత్రమే నిజమని, మధ్యలో మిగిలినదంతా నిజమో? అబద్ధమో? తెలియని పరిస్థితి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జీవితంలో మనసుకు సంతృప్తినిచ్చే కార్యక్రమాలు చేసినప్పుడే ఎక్కువ సంతోషం కలుగుతుందని చెప్పారు. విద్యార్థినుల ఉన్నత విద్యకు లాప్‌టాప్‌లు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో తానీ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. నిరుడు జన్మదినం సందర్భంగానే స్టేట్‌హోమ్ విద్యార్థులకు లాప్‌టాప్‌లు ఇవ్వాలని నిర్ణయించుకోగా, ఎన్నికల కారణంగా ఇవ్వలేకపోయానని, ఆ హామీని ఈ పుట్టినరోజున నెరవేర్చానని చెప్పారు.

గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా 1.50 లక్షల బాండ్

నరేశ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ అందజేత

శాలిగౌరారం, జూలై 24 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూర్‌కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకుడు, సాంస్కృతిక విభాగం ఉమ్మడి జిల్లా మాజీ కోఆర్డినేటర్ వేముల నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నరేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అండగా నిలిచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా ఆయన ముగ్గురు పిల్లలు అభిషేక్, ధనుశ్, తన్వీ పేరిట ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.1.50 లక్షలు స్థానిక బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఆ బాండ్‌లను బీఆర్ఎస్ శాలిగౌరారం మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు ద్వారా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు పంపించారు.



నరేశ్ కుటుంబ సభ్యులకు ఎఫ్‌డీ పత్రాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తరపున అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరిపూర్ణ నాయకుడు కేటీఆర్

సామాజికవేత్త సునీతాకృష్ణన్ కితాబు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రపంచం మొత్తంలో ఉన్న అతికొద్దిమంది స్ఫూర్తిదాయకమైన నాయకుల్లో ఒకరని ప్రముఖ సామాజికవేత్త సునీతాకృష్ణన్ కితాబిచ్చారు. కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఎక్స్ వేదికగా సునీతాకృష్ణన్ శుభాకాంక్షలు తెలుపుతూ.. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. 'ప్రపంచవ్యాప్తంగా పరిపూర్ణ నాయకత్వ శైలితో, నిస్వార్థంగా ఉంటూ నిర్మాణాత్మక చర్యలతో స్ఫూర్తినింపే నాయకులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారిలో కేటీఆర్ ఒక యువ నాయకుడని నేను భావిస్తున్నాను' అని కొనియాడారు. వారు నేత కార్మికులకు అండగా నిలిచారు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంచి తోడ్పాటునిచ్చారు, పలువురికి వైద్యసహాయం అందించారని పేర్కొన్నారు.

నేడు సిరిసిల్ల బంద్

మొదటిపేజీ తరువాయి...

10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్తు అందించాలని, ఆపైన 4వ క్యాటగిరీ కింద పరిగణించి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, బతుకమ్మ చీరలు లేదా జనతా వస్త్రాల పథకాలు, స్కూల్ డ్రెస్‌ల ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంస్థల ఐక్య వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయాలని, వర్క్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని, 10 శాతం యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, నేతన్న బీమా అమలు చేసి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతున్నది. వస్త్ర పరిశ్రమను శాశ్వతంగా సంక్షోభం నుంచి బయట పడేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ డిమాండ్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టినా స్పందన లేకపోవడంతో రిలే దీక్షలకు పూనుకున్నది. మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నా స్పందన లేకపోవడంతో.. గురువారం సిరిసిల్ల బంద్‌కు పిలుపునిచ్చింది. అయినా ప్రభుత్వం దిగి రాకపోతే.. ఈ నెల 27 అసెంబ్లీని ముట్టడిస్తామని జేఏసీ ప్రకటించింది.

అసెంబ్లీని ముట్టడిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతోనే వస్త్ర పరిశ్రమ సంక్షోభం నెలకొన్నది. తక్షణమే 15 కోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు ఊపాధి కల్పించాలి. పది హెచ్‌పీలకు వరకు మరమగ్గాలకు ఉచిత విద్యుత్తు అందించాలి.. నాలుగో క్యాటగిరీలో చేర్చి సబ్సిడీ కొనసాగించాలి. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన రూ.180 కోట్లు వెంటనే విడుదల చేయాలి. 2023 వరకు పెడింగ్‌లో ఉన్న యార్న్ సబ్సిడీ విడుదల చేయాలి. వర్క్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు అందించాలి. గురువారం నాటి బంద్‌కు వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలి. ప్రభుత్వంలో చలనం రాకపోతే ఈనెల 27 వేలాది మంది కార్మికులతో అసెంబ్లీని ముట్టడిస్తాం.

– మూషం రమేశ్,
తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆస్పెన్ బయోఫార్మా గోదాం సీజ్

- అనుమతి లేకుండా ఔషధాల తయారీ
- 96 లక్షల విలువ చేసే మందులు సీజ్

ఆస్పెన్ బయోఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ గోదాంలోని ఔషధాలను సీజ్ చేసిన అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): అక్రమంగా ఔషధాలు తయారు చేస్తూ, పెద్దఎత్తున నిల్వచేసిన ఆస్పెన్ బయోఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ గోదాంపై రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆబ్కారీ అధికారులతో కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.96లక్షల విలువ చేసే ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ బీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...ఆస్పెన్ బయోఫార్మా కంపెనీకి చెందిన కే సతీశ్‌రెడ్డిపై గతంలోనే అక్రమ ఔషధాల తయారీ, అక్రమ నిల్వలు, లైసెన్స్ లేకుండా గోదాం నిర్వహణ వంటి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి గ్రామం, పోతారం వై-జంక్షన్‌లో అక్రమంగా ఔషధాలు తయారు చేస్తూ, పెద్దఎత్తున ఔషధాలను నిల్వ చేశాడనే సమాచారం మేరకు డీసీఏ అధికారులు స్థానిక ఆబ్కారీ అధికారులతో కలిసి ఔషధాల గోదాంపై మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.96లక్షల విలువ చేసే యాంటీ క్యాన్సర్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీడిప్రెసెంట్స్ తదితర ఔషధాలను సీజ్ చేశారు. 2023లో మచ్చబొల్లారంలో నకిలీ యాంటీ క్యాన్సర్ ఔషధాల తయారీలో, ఖమ్మం జిల్లా అన్నారుగూడెంలో ఔషధాల ముడిసరకు తయారీలో నూ కే సతీశ్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు డీసీఏ అధికారులు వెల్లడించారు.

5 ఏండ్ల జైలు శిక్ష

డీసీఏ అనుమతి లేకుండా అక్రమంగా ఔషధాల తయారీ చట్టరీత్యా నేరం. నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. అనుమతి లేకుండా తయారు చేసే ఔషధాలు జీఎంపీ నిబంధనల ప్రకారం ఉండవు. ఇవి ప్రజల ప్రాణాలకు ప్రమాదం. సమాచారం ఉంటే డీసీఏ టోల్‌ఫ్రీ నెంబర్ 1800-599-6969 కు సమాచారం అందించండి.

– డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి

వివరాలు తెలుపుతున్న బాధితుడు

వడ్డీ ఆశతో డాటామీర్ యాప్‌లో పెట్టుబడులు

రూ.2 కోట్లకుపైగా మోసపోయిన బాధితులు

మంచిర్యాల అర్బన్, జూలై 24: కొందరు అత్యాశకుపోయి ఓ యాప్‌లో పెట్టుబడులు పెట్టి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డాటామీర్ అనే ఆన్‌లైన్ యాప్ (వడ్డీ యాప్) ద్వారా లింకులు రావడంతో మంచిర్యాలకు చెందిన దాదాపు 800 మంది అందులో చేరారు. పెట్టిన డబ్బులకు రెట్టింపు వడ్డీలు ఇస్తామంటూ నిర్వాహకులు ఏరోజుకారోజు ఆఫర్లు పెడుతూ ఆకర్షించారు. ఇందుకు ఆశపడిన అనేక మంది పెట్టుబడులు పెట్టారు. నిర్వాహకులు సైతం వారి పెట్టుబడికి తగ్గట్లుగా వడ్డీ రూపంలో డబ్బులు జమ చేస్తూ వచ్చారు. ఇలా నాలుగు నెలలుగా వ్యవహారం బాగానే నడిచింది. గత శుక్రవారం ఎన్ని డబ్బులు పెడితే.. బదులుగా అన్ని డబ్బులు తిరిగి చెల్లిస్తామని నిర్వాహకులు ఆఫర్ ఇవ్వడంతో అనేక మంది పుస్తెలతాళ్లు అమ్మి మరీ పెట్టుబడులు పెట్టారు. సోమవారం నుంచి డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. సీఐ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు.

రైల్వే బడ్జెట్‌లోనూ మొండిచెయ్యే

మొదటిపేజీ తరువాయి...

కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు పూర్తిస్థాయి రైల్వే బడ్జెట్‌లో కూడా తెలంగాణకు అన్యాయం చేసింది. కేవలం రూ.5,336 కోట్ల కేటాయింపుతో సరిపుచ్చారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పనులను 100 శాతం పూర్తి చేశామని, రాష్ట్రంలోని 437 ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలను నిర్మించామని, 40 స్టేషన్లను అమృత స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన రైల్వే ట్రాకుల నిర్మాణానికి రూ.32,946 కోట్ల ఖర్చవుతుందని తెలిపారు.

ఏపీకి అధిక నిధులు

ఏపీలో రైల్వేల అభివృద్ధికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.9,138 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌లో మరో రూ.9,151 కోట్లు కేటాయించింది. ఇప్పటికే 73 కొత్త రైల్వే లైన్లు పూర్తి చేశామని, 73 స్టేషన్లను అమృత స్టేషన్లుగా అభివృద్ధి చేశామని అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఏపీలో రూ.73,743 కోట్ల విలువైన 41 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నట్టు చెప్పారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, సీపీఆర్వో ఏ శ్రీధర్ పాల్గొన్నారు.

నీ కొడుకును అరెస్టు చేశాం.. ముంబై రండి!

- రోజుకో ఐడియాతో సైబర్ నేరగాళ్ల పంజా!
- తాజాగా హైదరాబాద్‌లో ఇద్దరికి కాల్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): నీ కొడుకును అరెస్ట్ చేశాం.. మేం ఫలానా పోలీసులం.. మీ బిడ్డను వదిలి పెట్టాలంటే వెంటనే ముంబై రావాలి.. ఇదీ సైబర్ నేరగాళ్ల నయా దందా. మీకు ఎంత మంది పిల్లలు.. ఏమి చేస్తున్నారు.. అంటూ అచ్చం పోలీసులు మాట్లాడినట్టే వాట్సాప్ కాల్ చేస్తారు. ఈ తరహా ఫోన్ కాల్స్ ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఇద్దరికి రావడం గమనార్హం. 'హలో మీకు పిల్లలెంత మంది.. ఏం చేస్తున్నారు.' అంటూ హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన ఓ వ్యక్తికి ఫోన్‌కాల్ వచ్చింది. 'మా పిల్లలు అమెరికాలో ఉంటున్నారు.' అని అనగానే 'హా మేము అమెరికా నుంచి మాట్లాడుతున్నాం.' అనడంతో కంగుతినడం అంబర్‌పేట వ్యక్తి వంతయింది. రాజేంద్రనగర్‌లో ఉండే మరొకరికి ఇలాంటిదే క